

ఒడిశాలో అనుమతులు.. ఏపీలో తవ్వకాలు

భామిని: మండలంలో వంశధార నది 25 కిలోమీటర్లు ప్రవ హిస్తుంది. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఓ సంస్థకు ఇసుక తవ్వకాలకు అనుమతి ఇచ్చింది. దీంతో నేరడి, బిల్లుమడ, తాలాడ రీచ్‌ల వద్ద స్థానిక వైసీపీ నాయకుల అండదండలతో కొందరు అక్రమ ఇసుక తవ్వకాలు చేపట్టి విశాఖకు తరలించేవారు. ప్రస్తుతం ఆ సంస్థ ఒప్పందం ముగియ డంతో ఈ రీచ్‌ల వద్ద తవ్వకాలు ఆగిపోయాయి. అయితే, ఒడిశా కాశీనగర్ బ్లాక్ బూదర నదీ తీరంలో ఇసుక తవ్వకాలకు అక్కడి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అయితే, ఒడిశా ప్రాంతం వైపు ఇసుక లేకపోవడంతో కాంట్రాక్టర్లు ఆంధ్రా వైపు వచ్చి తవ్వకాలు చేపడుతున్నారు. ఇదేంటని స్థానికులు అడిగితే ఇది ఒడిశా భూభాగం అని చెబుతున్నారు. దిమ్మిడిజోల, బాలరు, సొలికిరి నాయకులు స్థానిక రైతులకు నచ్చచెప్పి అలికాం-బత్తిలి ఏబీ రోడ్డు నుంచి బూదర భూభా గం వరకు తాత్కాలిక రహదారి ఏర్పాటు చేసి విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు చేపడుతు న్నారు. దీనిపై స్థానిక అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. పైగా ఇసుక తవ్వకాలకు వారికి అన్ని అనుమతులు ఉన్నాయని పేర్కొంటున్నారు.

ఇసుక తోడేస్తున్నారు

- జిల్లాలో చెలరేగిపోతున్న మాఫియా
- అనుమతులు లేకుండా తవ్వకాలు
- ట్రాక్టర్లు, లారీల్లో అక్రమంగా తరలింపు
- అధికార పార్టీ నేతల అండదండలు
- ఛిద్రమవుతున్న నదీ గర్భాలు
- పట్టించుకోని యంత్రాంగం

జిల్లాలో ఇసుకాసురులు చెలరేగిపోతున్నారు. నదులు, వాగులు, గెడ్డల గర్భాన్ని అక్రమంగా తోడేస్తూ ఇసుక దందా సాగిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకున్నా ప్రతిరోజూ వందల సంఖ్యలో ట్రాక్టర్లు, లారీల్లో ఇసుక తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రాత్రి వేళల్లో యంత్రాలను ఉపయోగించి ఇసుక తవ్వకాలు చేపట్టి విశాఖ, తదితర ప్రాంతాలకు తరలిస్తోన్నారు. పోలీసుల తనిఖీల్లో పట్టుబడితే కేసులు నమోదు చేస్తున్నారే తప్ప మైనింగ్, రెవెన్యూశాఖాధికారులు దాడులు చేసి ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేసిన పరిస్థితి జిల్లాలో లేదనే విమర్శలు ఉన్నాయి.

(పార్వతీపురం-ఆంధ్రజ్యోతి)



దిమ్మిడిజోల సమీపంలో ఇసుక తవ్వకాలు చేపడుతున్న దృశ్యం

జిల్లాలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. సీతానగరం, కొమరాడ, సాలూరు, బలిజిపేట, మక్కువ, పాలకొండ, జియ్యమ్మవలస తదితర మండలాల నుంచి ప్రతిరోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్లు, టిప్పర్లు, లారీల్లో ఇతర ప్రాంతాలకు ఇసుక అక్రమంగా తరలి పోతుంది. అక్రమార్కులు ఇసుక దందా సాగిస్తూ రెండు చేతులా సంపాదిస్తున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ట్రాక్టర్ ఇసుక రూ.700 నుంచి రూ.800కు లభించేది. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత రూ.3,500 నుంచి రూ.4,500 వరకు ధర పలుకుతుంది. దీనివల్ల ఇళ్ల నిర్మాణాలకు ప్రజలు వెనకడుగు వేస్తున్నారు. పాలకొండ మండలంలో అధికార పార్టీకి చెందిన ఓ ముఖ్య నాయకుని కనుసన్నల్లో ఇసుక దందా జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కురుపాం నియోజకవర్గంలో కూడా కొంతమంది అధికార పార్టీ నాయకుల అండదండలతో పెద్ద ఎత్తున ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.



ఇసుకతో వెళ్తున్న ట్రాక్టర్

నిఘా ఏదీ?

కొమరాడ: ఇసుక అక్రమ తవ్వకాలతో నదులు ఛిద్రమవుతున్నాయి. అనుమతులు లేకున్నా అధికార పార్టీ నేతల కనుసన్నల్లో ఈ దందా సాగుతుందన్న విమర్శలు ఉన్నాయి. మండలంలో నాగావళి నది నుంచి పగటి పూట ఎడ్ల బండ్లపై ఇసుకను తీసుకువచ్చి ఒకచోట నిల్వ చేస్తున్నారు. రాత్రి సమయంలో ఆ ఇసుకను ట్రాక్టర్లకు లోడ్ చేసి పార్వతీపురం పట్టణంతో పాటు పలు గ్రామాలకు రవాణా చేస్తున్నారు. ఈ విషయం అధికార యంత్రాంగానికి తెలిసినా అధికార పార్టీ సానుభూతిపరుల ట్రాక్టర్లు కావడంతో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పార్వతీపురం పట్టణంలో ట్రాక్టరు ఇసుక రూ.5 వేల నుంచి రూ.6 వేల వరకు పలుకుతుంది. అధికారుల నిఘా కొరవడడంతో ఇసుక దందా మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతోంది. ప్రతిపక్ష పార్టీ నేతలు అధికారులకు ఫిర్యాదు చేస్తే హడావిడిగా తనిఖీలు చేపట్టడం, ఒకట్రెండు కేసులు నమోదు చేయడం తప్ప అధికార యంత్రాంగం తనిఖీలు ఎక్కడా కనిపించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆనకట్టకు పొంచి ఉన్న ప్రమాదం..



కర్రివలస వేగావతి ఆనకట్ట వద్ద ఇసుక తవ్వకాలతో గుంతలు ఏర్పడిన దృశ్యం

పాచిపెంట: జగనన్న కాలనీ నిర్మాణాల పేరుతో కొందరు ఇసుక అక్రమ తవ్వకాలు చేపడుతున్నారు. మండలంలోని కర్రివలస పోతులగెడ్డ, పాంచాళి వట్టిగెడ్డ వద్ద ఇసుక తవ్వకాలకు అనుమతులు ఉన్నాయి. ఒకే రశీదుతో మూడు, నాలుగు లోడ్లు అక్రమంగా రవాణా చేస్తున్నారు. కర్రివలస వద్ద వేగావతి ఆనకట్టకు కిలో మీటరు దూరంలో తవ్వకాలు చేపట్టవలసి ఉంది. కానీ ఆనకట్టకు ఆనుకుని అక్రమార్కులు తవ్వకాలు చేపట్టి ఇసుక తరలిస్తున్నారు. దీంతో ఆనకట్టకు ప్రమాదం పొంచి ఉంది. అలాగే ఎటువంటి అనుమతులు లేకపోయినప్పటికీ మోసూరు, గురువునాయు డుపేట గెడ్డల వద్ద కూడా ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు.



సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు

శివారులో జోరుగా..

మక్కువ: మండలంలోని డి.శిర్లాం సువర్ణముఖి నదీ పరివాహక ప్రాంతం నుంచి ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా జరుగుతోంది. శివారు ప్రాంతం కావడంతో అక్రమార్కులు ఉదయం వేళలో సీతానగరం, పార్వతీపురం ప్రాంతాలకు ఇసుక తరలించడం పరిపాటిగా మారింది. మూడు రోజుల క్రితం మక్కువ పోలీసులు మాటువేసి మూడు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేసి వాటిని స్టేషన్‌కు తరలించారు.



నాగావళిలో ఇసుక కనిపించని దృశ్యం

అనుమతులు లేకున్నా..

గరుగుబిల్లి: తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు పరిధిలో ఇసుక రీచ్‌లకు అనుమతులు లేవు. కానీ, కొందరు అక్రమార్కులు టైరు బండ్లతో ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నారు. గతంలో తోటపల్లి, సుంకి, నాగూరు, చిలకాం, సొంబన్నవలస, పిట్టలమెట్ట గ్రామాల్లో ఇసుక రీచ్‌లను గుర్తించారు. అయితే, ఈ ప్రాంతాల్లో అనుకున్న మేర ఇసుక నిల్వలు లేని కారణంగా వంగర మండలం కోదులగుమడ, రాదులగుడమ నుంచి, అలాగే సీతానగరం మండలం పెదంకలాం నుంచి, బలిజిపేట మండలం నారాయణపురం నుంచి నిత్యం టైరు బండ్లతో అధికంగా ఇసుక రవాణా జరుగుతుంది. టైరు బండ్లకు ఎటువంటి నియంత్రణ లేకపోవడంతో రాత్రింబవళ్లు యథేచ్ఛగా ఇసుక రవాణా చేస్తున్నారు. బండి ఇసుకను రూ.1500 నుంచి రూ.2 వేలకు పైగా విక్రయిస్తున్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఇసుక తవ్వకాలతో తోటపల్లి నదీ ప్రాంతాల్లో గోతులు ఏర్పడ్డాయి. దీంతో పలువురు ఈ గోతుల్లో పడి మృత్యువాత పడ్డారు.



సొంబన్నవలస నుంచి టైరు బండ్లతో ఇసుకను రవాణా చేస్తున్న దృశ్యం

మద్దతు ధర ఏదీ?



- చింతపండుకు పాత ధరే
- కొత్త ధరను ప్రకటించని జీసీసీ
- రూ.32కే కొనుగోలు చేస్తామని ప్రకటన

సీతంపేట, ఫిబ్రవరి 3: మన్యంలో గిరిజన రైతులు సాగు చేస్తున్న చింత పండుకు ఈ ఏడాది గిరిజన సహకార సంస్థ (జీసీసీ) మద్దతు ధర ప్రకటించలేదు. దీంతో గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది ఇలాగే జీసీసీ మద్దతు ధర ప్రకటించకపోవడంతో సీపీఎం ఆధ్వర్యంలో గిరిజనులు జీసీసీ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. దీంతో కిలో చింతపండుకు రూ.32.40 మద్దతు ధర ప్రకటించింది. ఈ ఏడాది కూడా అదే ధరకు కొనుగోలు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. మైదాన ప్రాంతాల్లో కిలో చింతపండు ధర రూ.45 పైగానే పలుకుతున్నప్పటికీ జీసీసీలో మాత్రం పెంచకపోవడంపై గిరిజనులు ఆవేదన చెందుతున్నారు. రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత ఆరేళ్లుగా సీతంపేట గిరిజన సొసైటీ ఎన్నికలు జరగడం లేదు. దీనివల్ల అధికారులే తమకు అనుకూలమైన ధరను నిర్ణయించి గిరిజన ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నారు. మరోపక్క నరమామిడి చెక్కను ఈ ఏడాది కొనుగోలు చేయని పరిస్థితి నెలకొంది. గిరిజన ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించి మద్దతు ధరకు కొనుగోలు చేయాలనే ఉద్దేశంతో వన్‌దన్ వికాస్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలను జీసీసీ, ఐకేపీ ఆధ్వర్యంలో పర్యవేక్షించాల్సి ఉంది. కానీ, ఎక్కడా అలా జరగడం లేదు. దీనివల్ల ఈ కేంద్రాలు ఆశించిన స్థాయిలో పని చేయకపోవడంతో గిరిజన ఉత్పత్తుల కొనుగోలుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ విషయమై గిరిజన సహకార సంస్థ మేనేజర్ దాసరి కృష్ణ మాట్లాడుతూ.. 'ఈ ఏడాది చింతపండును పాత ధరకే కొనుగోలు చేస్తాం. ప్రస్తుతం కొత్త ధరలు ఏమీ ప్రకటించ లేదు.' అని తెలిపారు.



గిరిజన సహకార సంస్థ
H.O. విశాఖపట్నం - సీతంపేట డివిజన్
GCM సొసైటి సీతంపేట
అటవీ ఫలసాయముల కొనుగోలు ధరల పట్టిక

	సరుకు పేరు		కేజి ధర
1.	పిక్కతో చింతపండు	-	32.40
2.	నల్ల జీడిపిక్కలు	-	18.00
3.	కరక్కాయలు	-	18.00
4.	కొండ చీపుర్లు 1వ రకం	-	45.00
5.	కొండ చీపుర్లు 2వ రకం	-	40.00
6.	కొండ చీపుర్లు 3వ రకం	-	35.00
7.	కుంకుడుకాయలు	-	50.00
8.	చింత పిక్కలు	-	10.00
9.	తానికాయలు	-	15.00
10.	ఎండు ఉసిరిక పప్పు	-	80.00
11.	ముష్టిపిక్కలు	-	90.00
12.	ఇండుగుపిక్కలు	-	50.00

గిరిజన సహకార సంస్థ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన అటవీ ఉత్పత్తుల మద్దతు ధర

మూడేళ్లకు 20 శాతమే..

- నత్తనడకన పెద్దగెడ్డ ఆధునికీకరణ పనులు
- ఆరు నెలలుగా నిలిచిన వైనం
- సాగునీటి కోసం రైతుల అవస్థలు

పాచిపెంట, ఫిబ్రవరి 3

మండలంలోని పెద్దగెడ్డ ప్రాజెక్టు ఆధునికీకరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనులు ప్రారంభించి మూడేళ్లు కావస్తున్నా 20 శాతమే జరిగాయి. గత ఆరు నెలలుగా పనులు నిలిపివేశారు. పెద్దగెడ్డ ప్రాజెక్టు ఆధునికీకరణ నిమిత్తం 2020-21లో జైకా నిధులు రూ.23 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో కాలువల ఎర్త్, లైనింగ్, స్పిల్‌వే వద్ద ప్రొటెక్షన్, కర్రివలస వద్ద వేగావతి ఆనకట్ట మరమ్మతులు, తదితర పనులు చేపట్టాల్సి ఉంది. 27 కిలో మీటర్ల మేర కాలువలకు ఎర్త్ వర్కు చేయాల్సి ఉండగా 17 కిలో మీటర్ల వరకే జరిగాయి. అలాగే, లైనింగ్ పనులు రెండున్నర కిలో మీటర్లే జరిగాయి. పూర్తిస్థాయిలో పనులు జరగకపోవడంతో కాలువల ద్వారా శివారు భూములకు నీరు అందడం లేదు. ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టరు పనులు నిలిపివేసినట్లు తెలుస్తోంది. ఎర్త్‌వర్క్ చేసినప్పటికీ మళ్లీ యథావిధిగా తుప్పలతో కాలువలు పూడికపోయాయి. 12 వేల ఎకరాలకు సాగునీరందించేందుకు పెద్దగెడ్డ ప్రాజెక్టు నిర్మించారు. పాచిపెంట, సాలూరు, రామభద్రపురం మండలాలకు గాను 33 గ్రామాలకు సంబంధించి సాగునీరందించాల్సి ఉంది. పెద్దగెడ్డ జలాశయం ప్రధాన కాలువ నుంచి 7,500 ఎకరాలకు, జలాశయానికి అనుసంధానమైన కర్రివలస వేగావతి ఆనకట్ట కుడి, ఎడమ కాలువల ద్వారా 4,500 ఎకరాలకు సాగునీరందించాలి. పెద్దగెడ్డ ప్రాజెక్టును జాతికి అంకితం చేసిన నుంచి ప్రతి సంవత్సరం రైతులే కాలువలో పేరుకుపోయిన నాచును స్వయంగా తీసేవారు. జైకా నిధులు మంజూరయ్యాయని రైతులు సంతోషం వ్యక్తం చేసినప్పటికీ ఆధునికీకరణ పనులు నత్తనడకన సాగడంతో నిరాశ చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతున్నారు.



పెద్దగెడ్డ ప్రధాన కాలువ ఎర్త్‌వర్కు చేసినా మళ్లీ తుప్పలు పెరిగిన దృశ్యం

కాంట్రాక్టర్‌కు నోటీసులిచ్చాం..

పెద్దగెడ్డ ప్రాజెక్టు ఆధునికీకరణ పనులను నిలిపివేయడంపై సంబంధిత కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చాం. పనులు పునఃప్రారంభించాలని ఆదేశించాం. త్వరలో పనులు ప్రారంభమవుతాయి.

-జి.కనకారావు, డీఈఈ, పెద్దగెడ్డ జలాశయం



కర్రివలస వద్ద వేగావతి ఆనకట్టకు షట్టర్లు ఏర్పాటు చేయని దృశ్యం



పెద్దగెడ్డ స్పిల్‌వే

విధుల్లో చేరిన కొద్ది గంటల్లోనే..

- హత్యకు గురైన బొండపల్లి తహసీల్దార్ రమణయ్య
- జిల్లా రెవెన్యూ సిబ్బంది నిరసన

బొండపల్లి, ఫిబ్రవరి 3: విజయనగరం జిల్లా బొండపల్లి తహసీల్దార్ సనపల రమణయ్య (41) హత్యకు గురయ్యారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా బదిలీపై విశాఖపట్నం నుంచిఇక్కడకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన కొద్దిగంటల్లోనే ఆయన హత్యకు గురికావడం సంచలనం సృష్టించింది. ఈ విషయం తెలిసి ఉమ్మడి జిల్లాలోని రెవెన్యూ సిబ్బంది నిర్ఘాంతపోయారు. తహసీల్దార్‌గా ఆయన శుక్రవారం మధ్యాహ్నం 12.30 గంటలకు విధుల్లో చేరారు. దాదాపు రెండు గంటల పాటు సిబ్బందితో మాట్లాడాక విజయనగరం కలెక్టరేట్‌కు చేరుకున్నారు. అక్కడ ఆర్డీవో కార్యాలయం నుంచి కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. 6.40 గంటలకు ఇంటికి బయలుదేరి విశాఖ జిల్లా కొమ్మాదిలోని తన అపార్ట్‌మెంట్‌కు చేరుకున్నారు. రాత్రి దాడికి గురయ్యారు. ఆస్పత్రికి తరలించినా ప్రయోజనం లేకపోయింది. అప్పటికే పరిస్థితి విషమించడంతో శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. రమణయ్య విశాఖపట్నం రూరల్ చినగదిలి తహసీల్దార్‌గా పనిచేసిన కాలంలో భూ వివాదాలు ఉన్నాయని, ఆ కారణంతోనే హత్యకు గురై ఉండవచ్చునని ఇక్కడి సిబ్బంది అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రమణయ్య స్వగ్రామం శ్రీకాకుళం జిల్లా నందిగాం మండలం దిమిలాడ. భార్య అనూష, కుమార్తె సన్విసహస్ర, కుమారుడు కృష్ణరంగరేయాన్ ఉన్నారు.



తహసీల్దార్ రమణయ్య (ఫైల్)



వీరఘట్టంలో నిరసన తెలుపుతున్న రెవెన్యూ సిబ్బంది

ఉలిక్కిపడిన తహసీల్దార్లు..

పార్వతీపురం ఆంధ్రజ్యోతి: తహసీల్దార్ రమణయ్య హత్యతో జిల్లాలోని తహసీల్దార్లు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డా రు. నిబంధనలు పాటిస్తూ విధులు నిర్వహించిన అధికా రులపై దాడులు చేసి హతమార్చాడం అమానుషమని పలువురు తహసీల్దార్లు పేర్కొన్నారు. రమణయ్య హత్యను తీవ్రంగా ఖండిస్తూ దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. తహసీల్దార్ హత్యకు నిరసనకు రెవెన్యూ ఉద్యోగులు శనివారం నల్ల బ్యాడ్జీలతో విధులు నిర్వహించారు. కలెక్టరేట్‌లో పని చేస్తున్న ఉద్యోగులతో పాటు మండల రెవెన్యూ కార్యాలయాల్లో పని చేసిన ఉద్యోగులు కూడా నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. తహసీల్దార్‌పై దాడిని ముక్తకంఠంతో ఖండించారు. కలెక్టరేట్ పోర్టికో వద్ద రమణయ్య అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థించారు.

పర్యాటక కేంద్రంగా కుమ్మరిగండి

- 'గిరి గ్రామ్'కు ఎంపిక చేసిన అధికారులు

సీతంపేట, ఫిబ్రవరి 3: మండలంలోని కుమ్మరిగండి గ్రామాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవకాశాలను పరిశీలిస్తున్నట్లు పర్యాటకశాఖ అధికారి నడిమింటి నారాయణరావు తెలిపారు. ఈ మేరకు ఎంపీడీవో గీతాంజలితో కలిసి కుమ్మరిగండి గ్రామంలో శనివారం పర్యటించారు. జిల్లాలో పర్యాటక అభివృద్ధి వేగవంతం చేయాలని, ఇందులో భాగంగా గిరి గ్రామ్ పథకం కోసం ఒక గ్రామాన్ని ఎంపిక చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. కుమ్మరిగండిలో మంచి వ్యూపాయింట్లు, అందమైన ప్రకృతితో పర్యాటక అభివృద్ధికి ఎంతో అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు దీనిపై నివేదికను కలెక్టర్‌కు, సీతంపేట ఐటీడీఏ పీవోకు అందిస్తామని తెలిపారు.



కుమ్మరిగండి గ్రామాన్ని పరిశీలిస్తున్న జిల్లా పర్యాటక అధికారి

అన్ని రంగాల్లో ప్రభుత్వం విఫలం

- తెలుగుదేశం పార్టీ నాయకుల ధ్వజం
- బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పార్టీ నాయకులు కరపత్రాల పంపిణీ


విజయనగరం రూరల్: అబాద్‌వీధిలో ర్యాలీ నిర్వహిస్తున్న అదితి గజపతిరాజు, టీడీపీ నాయకులు


వేపాడ: వావిలపాడులో ర్యాలీని ప్రారంభిస్తున్న గొంప కృష్ణ


జామి: తాండ్రంగిలో మాట్లాడుతున్న కేపే నాయుడు

అన్నిరంగాల్లో ప్రభుత్వం విఫలమయ్యిందని తెలుగుదేశం పార్టీ నాయకులు ధ్వజమెత్తారు. శనివారం జిల్లాలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ మరోసారి అధికారంలోకి వస్తే జరిగే నష్టాలను ఇంటింటికి వెళ్లి వివరించి కరపత్రాలను అందజేశారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ మేనిఫెస్టోను వివరించారు.

సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం: అదితి

విజయనగరం రూరల్: బీసీ, ముస్లిం, మైనార్టీల సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరించందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు విమర్శించారు. విజయనగరంలోని 9, 29, 31 డివిజన్ల పరిధిలో రామకృష్ణనగర్, ధర్మపురిరోడ్డు, నటరాజ్‌కాలనీ, సుంకరవీధి, గోశాల, కోట్లమాదప్పవీధి, ఆబాద్‌వీధి ప్రాంతాల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం బీసీ, ముస్లిం, మైనార్టీలు, ఎస్సీ, ఎస్టీలకోసం ఏర్పాటు చేసిన పలు పథకాలను రద్దు చేసిందన్నారు. ప్రజావ్యతిరేక ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపే సమయం ఆసన్నమైందన్నారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. సమావేశంలో 9, 29, 31 డివిజన్లకు చెందిన వడ్లమాని సుభద్ర, చిగురుపాటి రజనీ, వేగుంట హరిబాబు, షేక్ అక్తర్, షేక్ జాఫర్ హుస్సేన్, ఇమ్రాన్, కాకర్లపూడి విశ్వనాథరాజు, పప్పు విశ్వనాథ శాస్త్రి, పి బలరామ్, ఎం రమేష్ నాయుడు పాల్గొన్నారు.

● విజయనగరంలోని 41వార్డులో బాబుష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం సువ్వారి అనురాధ బేగం ఆధ్వర్యంలో జరిగింది. డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు దాసరి హరిబాబు, బంగారి హరినాథ్‌తో పాటు, నగర పార్టీ నాయకుడు మస్తాన్ వలీ, డివిజన్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి చంద్రబాబు ఇచ్చిన ఆరు హామీలను ప్రజలకు వివరించారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి: గొంప కృష్ణ..

వేపాడ: చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గొంపకృష్ణ తెలిపారు. మండలంలోని వావిలపాడు, నల్లబిల్లి, చినగుడిపాల, నీలకంఠరాజపురం, కేఆర్‌పేట, కుమ్మపల్లి, మల్లంకి, బానాదిల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. నల్లబిల్లిలో మాట్లాడుతూ జగన్మోహనరెడ్డి పాలనలో అభివృద్ధి,సంఓఏమం కుంటిపడిందన్నారు. టీడీపీ మండ లాధ్యక్షుడు గొంప వెంకటరావు, నాయకులు గుమ్మడి భారతి, బల్లంకి, బొద్దాం మాజీ సర్పంచ్‌లు గొర్లె నాగరాజు, జనపరెడ్డి ఈశ్వరరావు పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీలకు గుర్తింపు: కేపే నాయుడు

జామి: రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వమే బీసీలకు గుర్తింపు ఇచ్చిందని గజపతినగరం మాజీ ఎమ్మెల్యే కొండపల్లి అప్పలనాయుడు తెలిపారు. శనివారం మండలంలోని తాండ్రంగిలో జయహోబీసీ సదస్సు నిర్వహించారు. వైసీపీ బీసీలను అణగదొక్కి వారి ఆగ్రహానికి గురైందని తెలిపారు. కార్యక్రమంలో పోలిపర్తి స్వామినాయుడు, కొత్తలి సూర్యారావు, పైడిరాజు,ముకుంద శ్రీను పాల్గొన్నారు.

గంజాయికి అడ్డాగా ఆంధ్రప్రదేశ్

- తెలుగుదేశం పార్టీ నాయకుల ఆరోపణ

రాష్ట్రాన్ని గంజాయింధ్రప్రదేశ్‌గా మార్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని తెలుగుదేశం పార్టీ నాయకుల ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌ను గంజాయికి అడ్డాగా మార్చేశారని ధ్వజమెత్తారు. శనివారం వేర్వేరు చోట్ల టీడీపీ నాయకులు విలేకరులతో మాట్లాడుతూ దేశంలో ఎక్కడ గంజాయి పట్టుబడినా.. దాని మూలాలు ఆంధ్రలోనే ఉంటున్నాయని తెలిపారు.

యథేచ్ఛగా అక్రమరవాణా: అదితి

విజయనగరం రూరల్: గంజాయి అక్రమ రవాణా యథేచ్ఛగా జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని టీడీపీ విజయనగరం నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు ఆరోపించారు. శనివారం విజయనగరంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ నాలుగు ఏళ్ల తొమ్మిది నెలల్లో రాష్ట్రంలో గంజాయి అక్రమ రవాణా కేసులు విస్తృతమయ్యాయన్నారు. నిరుద్యోగులు, యువతకి సరైన ఉపాధి అవకాశాలు లేకపోవడం వల్ల బానిసలుగా మారడంతో పాటు, గంజాయి అక్రమ రవాణా వైపు మళ్లుతున్నారని తెలిపారు. ప్రభుత్వం రాష్ట్రంలో కొత్తగా పరిశ్రమలు తీసుకురాలేకపోయిందని, ఉన్న పరిశ్రమలు తరలిపోయే విధంగా ప్రభుత్వ విధానాలు ఉన్నాయని ధ్వజమెత్తారు. గంజాయి అక్రమ రవాణాతోపాటు, సేవించే వారి సంఖ్య కూడా పెరిగిపోతుందని ఆందోళన వ్యక్తంచేశారు. టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, కనకల మురళీమోహన్, ప్రసాదుల ప్రసాద్, బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయడు, కంది మురళీనాయుడు, గంటా రవి, జి.వెంకటరావు పాల్గొన్నారు.

ఉద్యోగావకాశాలు లేకే గంజాయికి బానిసలు : నాగార్జున

నాలుగున్నరేళ్లలో దేశంలో ఎక్కడ గంజాయి పట్టుబడినా, దానికి మూలాలు ఆంధ్రప్రదేశ్‌లోనే ఉంటున్నాయని టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యువత, నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కరువయ్యాయని ఆరోపించారు. వైసీపీ పాలనలో రాష్ట్రానికి కొత్తగా ఒక పరిశ్రమ రాకపోగా, పాలకుల నిరంకుశ వైఖరి, విధానాలు వల్ల పలు పరిశ్రమలు రాష్ట్రం నుంచి తరలివెళ్లిపోయాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఉపాధి, ఉద్యోగావకాశాలు లేకపోవడం వల్ల నైరాశ్యంలో కూరుకుపోయిన యువత గంజాయికి బానిస అవుతోందన్నారు. గంజాయి సేవించడం, విక్రయించడం వంటి కేసులు కుప్పలు, తెప్పలుగా నమోదు అవుతున్నా, ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవడం లేదని ఆయన ఆరోపించారు.

వ్యవస్థలన్నీ నిర్వీర్యం: లలితకుమారి

లక్కవరపుకోట: వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో కాపలా కాయల్సిన కంచే చేను మేస్తోందని ఎస్.కోట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఆరోపించారు. శనివారం ఎల్.కోటలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రం పరువు జగన్ తీసేశాడని మండిపడ్డారు. శుక్రవారం రాష్ట్ర బెటాలియన్ పోలీసులు గంజాయితో తెలంగాణ పోలీసులకు దొరకడం సిగ్గుపడాల్సిన విషయమన్నారు. నిరంతరం నిఘా వేయల్సిన పోలీసులే దొంగతనాలు చేస్తే ప్రజలు ఏమనుకోవాలని ప్రశ్నించారు. పాలించేవాడు దొంగైతే అధికారులు అలాగే తయారవుతారని విమర్శించారు. వ్యవస్థలన్నీ నిర్వీర్యం అయిపోయాయని ఆందోళన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో కోళ్ల శ్రీను, లాలాం అర్జునరావు, ఎం.శీలక్ష్మి, ఎం.శ్రీను పాల్గొన్నారు.



లక్కవరపుకోట: మాట్లాడుతున్న కోళ్ల లలితకుమారి

అనుమానాస్పదస్థితిలో ఒడిశా వాసి మృతి

బొబ్బిలి: పట్టణంలోని శ్రీ సూర్యరెసిడెన్సీలో ఒడిశా రాజధాని భువనేశ్వర్‌కు చెందిన ఇందుభూషణ్ పాత్రో (65) అను మానాస్పదస్థితిలో మృతిచెందాడు.సీఐ మలిరెడ్డి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్ఐ చదలవాడ సత్యనారాయణ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. పోలీసుల కథనం మేరకు.. స్థానిక గ్రోత్‌సెంటర్‌లోని మిన్‌కార్ప్ రిసోర్స్ లిమిటెడ్ కంపెనీలో కన్సల్టెన్సీగా పనిచేస్తున్న ఇందుభూషణ్ పాత్రో ఈనెల ఒకటో తేదీ తెల్లవారుజామున లాడ్జిలో 204 నెంబరు రూమును బుక్‌చేసుకున్నాడు. గురువారం ఉదయం లాడ్జిలోని రూములోపలికి వెళ్లిన పాత్రో మూడురోజులైనా బయటకురాలేదు. లాడ్జి సిబ్బంది పలు దఫాలు తలుపు తట్టినా తీయలేదు. శనివారం ఉదయం రూము నుంచి దుర్గంధం వెలువడడంతో సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. వారి సమక్షంలో తలుపులను బలవంతంగా తెరిచి చూడగా మంచంపై బోర్లాపడి పాత్రో మృతదేహం పడిఉంది. అక్కడ లభ్యమైన ఫోన్‌నెంబరు ఆధారంగా ఒడిశాలోని కుటుంబసభ్యులకు పోలీసులు సమాచారం అందించారు. సీసీటీవీ పుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు. మృతదేహాన్ని స్థానిక సీహెచ్‌సీలోని మార్చురీకి తరలించారు. పాత్రో కుటుంబసభ్యులు ఇచ్చే ఫిర్యాదు ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తామని సీఐ నాగేశ్వరరావు తెలిపారు. పాత్రో మృతికి దారితీసిన కారణాలపై ఆరా తీస్తున్నామని చెప్పారు.

రేగలో యువకుడు ఆత్మహత్య


మధు (ఫైల్)

లక్కవరపుకోట:మండలంలోని రేగ గ్రామానికి చెందిన కొచ్చర్ల మోహన్‌సాయి (మధు) (24) ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ ఆర్.గోపాలరావు తెలిపారు.ఎస్ఐ కథనం మేరకు.. రేగ గ్రామానికి చెందిన మోహన్‌సాయి ఒక యాక్సిడెంట్ కేసును షటిల్ చేద్దామని శుక్రవారం వెళ్లగా భార్యపద్మ మందలించింది. దీంతో మన స్థాపానికిగురై రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. రాత్రిపూట వెతికినా దొరకలేదు. తెల్లవారు గ్రామానికి దగ్గరలో గల మామిడితోటలో ఉరివేసుకుని ఉన్నట్లు గుర్తించారు. తండ్రి శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశారు.

పేకాడుతున్న నలుగురి అరెస్టు

కొత్తవలస: మండలంలోని రామలింగపురంలో పేకాటాడుతున్న నలుగురిని అరెస్టుచేసినట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. వీరి నుంచి 28 వేల 80 రూపాయలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అరెస్టు చేసిన వారిని సొంత పూచీకత్తుపై విడుదల చేశామని తెలిపారు.

మద్యం రవాణా చేస్తున్న ఒకరి..

విజయనగరం క్రైం: విజయనగరం రైల్వే పోలీసులు ఆధ్వర్యంలో రైలులో అక్రమంగా మద్యం రవాణా చేస్తున్న ఓ వ్యక్తిని అరెస్టుచేసి 7,080 రూపాయల వ్యయం చేసే మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు జీఆర్పీ ఎస్ఐ రఘువర్మ తెలిపారు. రైళ్లలో తనిఖీలు నిర్వహిస్తుండగా, బొబ్బిలికి చెందిన ఓ వ్యక్తి ఒడిశాలోని రాయగడ నుంచి బొబ్బిలికి రవాణా చేస్తుండగా తనిఖీల్లో పట్టుబడ్డారు.ఈ తనిఖీల్లో పీసీలు రవికుమార్, సురేష్, దిలీప్, సంతోష్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు అరకొరగా పరికరాలు

బొబ్బిలి:స్థానికఎంపీ కార్యాలయంఆవరణలో శనివారం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోగల నాలుగు మండలాల దివ్యాంగులకు అరకొరగా పరికరాలను పంపిణీ చేశారు. నాలుగైదు నెలల కిందట బొబ్బిలిలో అర్హులైన దివ్యాంగుల ఎంపిక నిర్వహించిన సంగతితెలిసిందే. వారిలో కొంతమందికి విజయనగరంలో పలు పరికరాలను పంపిణీచేశారు. మిగిలిన వారికి శనివారం ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు చేతులమీదుగా అందజేసేందుకు ఎంపీడీవో రవికుమార్ ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లుచేశారు. 21.85 లక్షల రూపాయల విలువ చేసే హియరింగ్ మిషన్లు, లెప్రసీ బాధితులకు పరికరాలు, మెంటల్లీ ఇంపెయిర్డ్, మల్టిపుల్ ఇంపెయిర్డ్, ఆర్థోఇంపెయిర్డ్, విజువల్లీ పరికరాలను 263 మందికి అందజేశారు. బొబ్బిలి అర్బన్, రూరల్, బాడంగి , తెర్లాం, రామభద్రపురం మండలాల్లోని 197 మందికి పరికరాలను పంపిణీచేయాల్సి ఉండగా 131 మాత్రమే మంజూరు చేశారు. ఆర్థోపెడికల్లీ ఇంపెయిర్డ్ వంద పరికరాలు అవసరం కాగా 34 మందికి మాత్రమే, 18 వీల్‌చైర్స్, 10 ట్రైసైకిళ్లు, క్రైలెర్స్ 2, గుటుంబర్స్-4 చొప్పున మంజూరు చేశారు. విజయనగరంలో పరికరాలు తయారవుతున్నందున మిగిలిన వారందరికీ మరోదఫా పంపిణీ చేస్తామని అధికారులు తెలిపారు. ఎన్నికలకోడ్ త్వరలో విడుదలకానున్న నేపథ్యంలో వాటి పంపిణీ ఇక ప్రశ్నార్థకమేనని ఆశావహులైన లబ్ధిదారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

బీఎల్వోలతో ఈఆర్వో సమావేశం


తహసీల్దార్‌కార్యాలయంలో బీఎల్వోలతో సమావేశం నిర్వహిస్తున్న మురళీకృష్ణ

శృంగవరపుకోట /జామి:జామి, శృంగవరపు కోట తహసీల్దార్ కార్యాలయాల్లో శనివారం ఈఆర్వో మురళీకృష్ణ బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎన్నికల అంశాలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్లు శ్రీనివాసరావు,రాంబాయ్ పాల్గొన్నారు.

మృతుల ఓట్లన్నీ తొలగిస్తాం: ఆర్డీవో


అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో సాయిశ్రీ

బొబ్బిలి:ఓటర్ల జాబితాల్లో మృతిచెందిన వారి పేర్లను కచ్చితంగా తొలగిస్తామని ఆర్డీవో సాయిశ్రీ తెలిపారు. ఓటర్ల జాబితాల్లో ఇంకా మృతి చెందిన వారి పేర్లు, స్థానికేతరుల పేర్లు తదితర తప్పిదాలు చోటు చేసుకున్నట్లు ఆర్డీవో దృష్టికి తీసుకురాగా స్పందించారు.ప్రతి మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తున్నామని, ఎటువంటి సమస్యలు ఉన్నా పరిష్కరిస్తామని తెలిపారు.రానున్నఎన్నికల నిర్వహణకు అన్నివసతులతో కూడిన భవనాలకు అధికారులు అన్వేషణ ప్రారంభించారు. ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్‌రూమ్,సిబ్బందికి విధులను అప్పగించే ప్రక్రియకు అనువుగా ఉండే కళాశాల లేదా పెద్ద విద్యాసంస్థ కోసం ఆర్డీఓ ఎ.సాయిశ్రీ, డీటీలు రెడ్డి సాయికృష్ణ, బలివాడ గౌరీశంకర్ శనివారం వివిధ విద్యాసంస్థలను పరిశీలించారు.

తొలగించిన చోటే చెత్తసంపద కేంద్రం


ప్రారంభమైన చెత్తసంపద కేంద్రం పనులు

వంగర: అరసాడలో చెత్తసంపద కేంద్రం తొలగించిన ప్రాంతంలోనే పనులు శనివారం ప్రారంభమయ్యాయి. ఆంధ్రజ్యోతిలో ఇటీవల చెత్త సంపద కేంద్రం కొల్లగొట్టారు అన్న శీర్షికతో కథనం ప్రచురితంకావడంతో డీపీవో స్థానిక పంచాయతీ అధికారి విజయ్ కుమార్, కార్యదర్శి వేణు నాయుడులకు మెమోలు జారీచేశారు. చెత్తసంపద కేంద్రం కొల్లగొడితే ఏమీ చేశారని, ఎందుకు చర్యలు తీసుకోలేదో వివరణ ఇవ్వకపోతే సస్పెండ్‌చేయడంతోపాటు చెత్త సంపద కేంద్రం నిర్మాణ వ్యయం రూ.14 లక్షలు రికవరీ చేస్తామని నోటీసులో పేర్కొన్నారు.దీంతో అధికారులు తొలగించిన ప్రాంతంలో యధావిధిగా నిర్మాణాలు ప్రారంభించారు.
అయితే చెత్తసంపద కేంద్రం నిర్మాణం ఉపాధి సిబ్బంది పర్యవేక్షణలో జరగాల్సి ఉంది. గాని ఇక్కడ వారికి తెలియకుండా గోప్యంగా కూలీలే ఇంజినీర్లుగా వ్యవహరించిపనులు జరుపుతున్నారు.ఈపనులు ఇలా జరపవచ్చా అని కార్యదర్శి వేణునాయుడు వివరణ కోరగా వారు గతంలో ఇచ్చిన కొలతలు ఉన్నాయని, వాటి ప్రకారం ఇక్కడ మూడు వేలు జనాభాకు సరేపడే పద్ధతిలో యదావిధిగా కడతామని చెప్పారు.గత కొలతలు పాటిస్తామని, అందుకేవారికి చెప్పలేదని తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

8న బాడంగిలో లోకేశ్ పర్యటన

- స్థల పరిశీలన చేసిన బేబీనాయన

రాజాం రూరల్: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఈనెల 8న సాలూరు, బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో నిర్వహించే బహిరంగ సభల్లో పాల్గొంటారు. రాత్రికి చీపురుపల్లి చేరుకుని అక్కడ బస చేస్తారు. 9న ఉదయం చీపురుపల్లి, నెల్లిమర్ల నియోజకవర్గాలలో సభల్లో పాల్గొంటారు. అదేరోజు రాత్రి విజయనగరం చేరుకుని 10న విజయనగరం, గజపతినగరం, శృంగవరపుకోట నియోజకవర్గాల్లో పర్యటిస్తారు. ఈనెల 8న బాడంగిలో జరిగే సభ ఏర్పాటుకు సంబంధించి బొబ్బిలి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బేబినాయన శనివారం స్థలాన్ని పరిశీలించారు. ఈ విషయాన్ని ఆయన శనివారం రాత్రి తెలిపారు. కాగా లోకేశ్ పర్యటనలో స్వల్ప మార్పులు జరిగే అవకాశాలు లేకపోలేదని పార్టీవర్గాలు చెబుతున్నాయి. అలాగే 7న ఉదయం పాలకొండ, కురుపాం, పార్వతీపురం నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామ్మూర్తినాయుడు


రాజాం మునిసిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

రాజాం రూరల్:మునిసిపల్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామ్మూర్తినాయుడు కోరారు.ఈ మేరకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్నిరాజాం మునిసిపల్ కమిషనర్ అప్పలనాయుడుకు యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసరావు, అనిల్‌కుమార్, గురువులు, లక్ష్మి, కనకరాజుతో కలిసి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల పీఎఫ్ సమస్య పరిష్కారం కాకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. కార్మికుల సంఖ్య పెంచాలని కోరారు.

బీమా సౌకర్యం కల్పించాలి

లక్కవరపుకోట:మధ్యాహ్నభోజనకార్మికుల సమస్యలు పరిష్కరించాలని కార్మిక సంఘ నేతలు గాడి అప్పారావు ఆధ్వర్యంలో ఎంఈవో శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం జగన్ ఇచ్చిన మాట తప్పారని వాపోయారు. వేతనాలు కూడా సరిగా ఇవ్వలేదని పేర్కొన్నారు. మెస్‌చార్జీలు రూ. 20 ఇవ్వాలని, బీమా సౌకర్యం కల్పించాలని, సెలవులు, ఏడాదికి రెండు జతల బట్టలు ఇవ్వాలని డిమాండ్‌చేశారు.కార్యక్రమంలో పైడితల్లి, లక్ష్మి, అచ్చయ్యమ్మ పాల్గొన్నారు.

నాణ్యమైన పనులు చేయాలి: ఎంపీడీవో

రామభద్రపురం: ఉపాధిహామీ పథకంలో వేతనదారులు నాణ్యమైన పనులు చేయాలని ఎంపీడీవో ఈశ్వరమ్మ సూచించారు. రామభద్రపురంలో జరుగుతున్న ఉపాధి పనులను శనివారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జి.త్రినాథరావు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'లో ఆధిపత్య పోరు

- రాజీవ్ క్రీడా మైదానంలో ఘర్షణ వాతావరణం
- నేటికి పురుషుల కబడ్డీ పోటీలు వాయిదా
- పోలీసుల రంగ ప్రవేశం


రాజీవ్ క్రీడా మైదానంలో క్రీడాకారులతో చర్చిస్తున్న పోటీల నిర్వాహకులు

విజయనగరం రూరల్: విజయనగరంలో ఆడుదాం ఆంధ్రా పోటీలపై రాజకీయ ఆదిపత్య ప్రభావం పడింది. కబడ్డీ క్రీడకు సంబంధించి మూడు అసోసియేషన్లు ఉన్నాయి.ఇవి ఎప్పటికప్పుడు పోటీలు నిర్వహించి తమదే.. నిజమైన గుర్తింపు సంఘమని ఎవరికి వారు ప్రకటనలిస్తుంటారు. తాజాగా ఈ ఆదిపత్య పోరు ఆడుదాం ఆంధ్రా పోటీలపై పడింది. విజయనగరంలో రెండు కబడ్డీ అసోసియేషన్లకు పెద్దగా జడ్పీ చైర్‌పర్సన్ మజ్జి శ్రీనివాసరావు కొనసాగుతున్నారు. ఓ సంఘానికి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అల్లుడు ప్రాతినిధ్యం వహిస్తుండగా, విజయనగరంలో ఎప్పుడూ కబడ్డీ పోటీలు నిర్వహించినా, వీరభద్రస్వామి, ఆయన అనుచరులు కూడా ఆదిపత్యం ప్రదర్శిస్తుంటారు.తాజాగా రాజీవ్ క్రీడామైదానంలో శనివారం ప్రారంభమైన ఈ పోటీల్లో ఆ ప్రభావం పడింది. ఎవరికి వారే.. తమదే ఆదిపత్యం అన్న రీతిలో వ్యవహరించారు. ఈవివాదం జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు దృష్టికి క్రీడాకారులు, క్రీడాసంఘాల ప్రతినిధులు తీసుకువెళ్లారు.ఆయన తనదైన శైలిలో ఇది ప్రభుత్వ కార్యక్రమం, విజయనగరం ఎమ్మెల్యేతో తాను మాట్లాడుతానని, మీరంతా ఆడుకొండని చెప్పి పంపేశారు. కాని శనివారం రాత్రి పురుషుల కబడ్డీ తప్ప, అన్ని పోటీలు ముగిశాయి. విజయనగరం జిల్లా పరిధిలోని ఏడు నియోజకవర్గాల నుంచి ఏడు జట్లు వచ్చాయి.తొలిమ్యాచ్ గజపతినగరం, చీపురుపల్లిమధ్య జరగాల్సిఉంది. ఆడుదాం ఆంధ్రా నిబంధనలు సరిగ్గా లేకపోవడంతోమ్యాచ్ ప్రారంభంలోనే వివాదం మొదలైంది. సచివాలయ స్థాయిలో రిజిస్ట్రేషన్ సరిగ్గా చేయకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ఈనేపథ్యంలో రాజీవ్‌క్రీడామైదానంలో క్రీడాకారులు మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడింది.కేకలు,అరుపులు, తోపులాటలతో క్రీడామైదానం దద్దరిల్లింది. రాత్రి తొమ్మిది గంటలకు పోలీసులరంగ ప్రవేశంచేశారు.సముదాయించి తాత్కాలికంగా పోటీలు నిలిపివేశారు. సెట్విజ్ సీఈవోతోపాటు పలువురు అధికారులు పరిస్థితిని సమీక్షించి, ఆదివారం మ్యాచ్‌లునిర్వహిస్తామని ప్రకటించి, క్రీడాకారులను పంపించివేశారు.

సీఆర్‌పీఎఫ్ జవాన్‌కు అభినందన

బాడంగి: ముగడ గ్రామానికి చెందిన సీఆర్‌పీఎఫ్ జవాన్ తెంటు గౌరీశ్వరికి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు శనివారం అభినందించారు. ప్రస్తుతం కేరళలో విధులు నిర్వహిస్తున్నగౌరీశ్వరి ఢిల్లీలో గణతంత్ర దినోత్సవంలో సీఆర్‌పీఎఫ్ మహిళా జవాన్ల తరపున నిర్వహించిన మార్చ్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు. దీంతో రాష్ట్రపతి ద్రౌపది ముర్మ్ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు బొబ్బిలి వాలీబాల్ జట్టు

బొబ్బిలి: బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గ వాలీబాల్ జట్టు ఆడుదాం ఆంధ్రాలో రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు సీనియర్ పీడీ, గ్రౌండ్ ఇన్‌చార్జి నల్ల వెంకటనాయుడు తెలిపారు.విజయనగరంలో జరిగిన పోటీలో ఎస్.కోట జట్టుపై బొబ్బిలి విజయం సాధించడంతో అర్హత సాధించినట్లు చెప్పారు. ఈనెల 9నుంచి విశాఖలో జరిగేరాష్ట్రస్థాయి పోటీల్లో బొబ్బిలి జట్టు పాల్గొంటుందని తెలిపారు. జట్టుకు కెప్టెన్‌గా బూరి భాస్కరరావు వ్యవహరించారు.

బస్‌షెల్టర్ ప్రారంభం

బొబ్బిలి: స్థానిక రాణీమల్లమ్మదేవి మున్సిపల్ పార్కు సమీపంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నూతనంగా బస్‌షెల్టర్‌ను నిర్మించారు. దీనిని స్థానిక ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకటమురళీకృష్ణారావు, రోటరీ క్లబ్ అధ్యక్షుడు జేసీ రాజు, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ తూముల కార్తీక్, నంబియార్ వేణుగోపాలరావు, శ్రీనివాసన్, శ్రీహరి, తమ్మిరెడ్డి దామోధరరావు పాల్గొన్నారు.

శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలి

విజయనగరం దాసన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల ద్వారా శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు గదుల వెంకటరావు డిమాండ్ చేశారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఆర్థికంగా వెనుకబాటు వల్ల ప్రైవేటుసంస్థల ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలకు శిక్షణ తీసుకోవడం కష్టమవుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇటీవల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల చేశాయని... ఈ నేపథ్యంలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌తో పాటు, నైపుణ్యం గల అధ్యాపకులతో శిక్షణ ఇప్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘ ప్రతినిధులు చోడి ఆదినారాయణ, శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

'కోళ్ల'కు పరామర్శ

లక్కవరపుకోట: విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ కోళ్ల లలితకుమారి, రాంప్రసాద్ దంపతులను పరామర్శించారు. మాజీ మంత్రి కోళ్ల అప్పలనాయుడు సతీమణి పైడితల్లమ్మ ఇటీవల మరణించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు డెయిరీ చైర్మన్‌తో పాటు డైరెక్టర్లు హాజరై తమ సంతాపాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు మహంతి చిన్నంనాయుడు, కె.రమణమూర్తి, కరెడ్ల ఈశ్వరరావు, మల్లా రామకృష్ణ, కొట్యాడ రమణమూర్తి పాల్గొన్నారు.

తనిఖీ పారదర్శకంగా జరగాలి

వేపాడ: ఉపాధి పనులపై చేపట్టే సామాజిక తనిఖీ పారదర్శకంగా జరగాలని ఎస్ఆర్పీ ఎస్.అచ్చుతరావు కోరారు. శనివారం వేపాడలో ఈ పథకం క్షేత్ర స్థాయి, టెక్నికల్ సిబ్బంది,ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడు తూ మండలంలో వేతనాల రూపంలో రూ.12,46, 71,293 ,మెటీ రియల్ పనులకు గాను రూ.2 కోట్ల 6 లక్షల 16,500,మొత్తం 15 కోట్ల 52 లక్షల 85వేలు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు ఖర్చుకు సంబంధించి పత్రాలను అందించాలని సూచించారు. కార్యక్రమంలో మండల పంచాయతీరాజ్ ఇంజినీర్ అలీ, ఏపీవో ఆదిలక్ష్మి, డీఆర్పీలు పాల్గొన్నారు.

శతశాతం ఫలితాల సాధనే లక్ష్యం: డిప్యూటీ డీఈవో


వేపాడ పాఠశాలను పరిశీలిస్తున్న వాసుదేవరావు

వేపాడ: పదోతరగతి పరీక్షల్లో శతశాతం ఫలితాలే లక్ష్యంగా విద్యార్థులను తీర్చిదిద్దాలని, పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారి కంది వాసుదేవరావు కోరారు.శనివారం వేపాడ, నీలకంఠరాజపురం ఉన్నత, దబ్బిరాజుపేట, చామలాపల్లి ప్రాథమిక పాఠశాలలను, ఎమార్సీని తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిసబెక్టుపై పట్టు సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఆయన వెంట ఎంఈవో బాలభాస్కరరావు, హెచ్‌ఎంలు, సిబ్బంది ఉన్నారు.

నేడు కొండ డాబా వ్యాకులమాత జాతర

- నిర్వాహకుల ఏర్పాట్లు
- 260 మందితో బందోబస్తు

కొత్తవలస:కొండడాబా వ్యాకులమాత జాతరకు నిర్వాహకులు ఏర్పాట్లుచేశారు. కొత్తవలసకుమూడు కిలోమీటర్ల దూరంలోని కొండడాబాకు చెందిన కొండపై 1886లో ఫ్రాన్స్ నుంచి తీసుకొచ్చిన వ్యాకులమాత(కనికరమాత) విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.అప్పటి నుంచి క్రమం తప్పకుండా ఏటా ఫిబ్రవరి మొదటి ఆదివారం కొండపై ఉన్న వ్యాకులమాత జాతరను నిర్వహిస్తున్నారు. కోరినకోర్కెలను తీర్చే కల్పవల్లిగా క్రైస్తవులు వ్యాకులమాతను నమ్ముతుంటారు. దీంతో మొక్కులు తీర్చుకోవడానికి వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు వస్తుంటారు చివరగా ఆదివారం తెల్లవారు జామునుంచే ప్రతిగంటకు ప్రత్యేకప్రార్థనలు నిర్వహిస్తారు. ఇలా 11 గంటల వరకు ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించిన అనంతరం వివిద ప్రాంతాల నుంచి వచ్చిన మత పెద్దలు ఆధ్యాత్మిక ప్రసంగాలను రెండు గంటల వరకు ఇస్తారు. ప్రసంగాల అనంతరం వ్యాకులమాత ఉత్సవం పూర్తయినట్లు ప్రకటిస్తారు. కొండడాబాలో నిర్వహించే వ్యాకులమాతకు విశాఖలోని జ్ఞానాపురంలో ఉన్న చర్చికి సంబంధముంది. జాతరకు ముందురోజు జ్ఞానాపురం నుంచి ఏసు తల్లిగా భావించే మరియమ్మ ప్రతిమను ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన పల్లకిలోపెట్టి పాదయాత్రగా కొండడాబాకు తీసుకొచ్చి ప్రార్థనలు చేస్తారు.ఇక్కడ దేశంలోనే అత్యంత ఎత్తయిన 120 అడుగులు ఏసుక్రీస్తు విగ్రహాన్ని ఏర్పాటుచేసిన విషయం విదితమే. కాగా ఆదివారంజరిగే జాతరకు సుమారు లక్ష మందికి పైబడి భక్తులు హాజరవుతారని నిర్వాహకులు అంచనావేశారు. ఇందుకు తగ్గట్లుగానే ఏర్పాట్లుచేశారు.విజయనగరం డీఎస్పీ గోవిందరావు పర్యవేక్షణలో సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వివిధ పోలీసుస్టేషన్ల నుంచి ఎస్ఐలతో పాటు 260 మంది సిబ్బందిని శనివారం సాయంత్రానికే రప్పించారు. జాతరకు విశాఖ, విజయనగరం, ఎస్.కోట డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. జాతరకు వచ్చే వాహనాల వల్ల ట్రాఫిక్ సమస్యలేకుండా ఒకమార్గంలో వచ్చే వాహనాలను అదే మార్గంలో తిరిగి వెళ్లకుండా ఏర్పాట్లుచేశారు.20 వేల వరకు వాహనాలు వచ్చే అవకాశం ఉన్నందున ప్రత్యేక పార్కింగ్ సౌకర్యం కల్పించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

- బొండపల్లి తహసీల్దార్ హత్యకు జిల్లా వ్యాప్తంగా నిరసన
- నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరైన రెవెన్యూ సిబ్బంది

విజయనగరం జిల్లా బొండపల్లి మండలం తహసీల్దార్ ఎస్.రమణయ్య హత్యను ఖండిస్తూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ అధికారులు, సిబ్బంది శనివారం నిరసన చేపట్టారు. నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. రమణయ్య మృతికి సంతాపం తెలుపుతూ నివాళుల ర్పించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న తహసీల్దార్లకు ప్రత్యేక రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

(ఆంధ్రజ్యోతి బృందం)


కురుపాం: నివాళులర్పిస్తున్న రెవెన్యూ సిబ్బంది


గరుగుబిల్లిలో..


సీతంపేట: నిరసన తెలియజేస్తున్న వీఆర్వోలు


బొబ్బిలి: నివాళులర్పిస్తున్న బొబ్బిలి రెవెన్యూ అధికారులు


నిరసన తెలుపుతున్న టీడీపీ నాయకులు


రామభద్రపురం: నిరసన తెలుపుతున్న రెవెన్యూ సిబ్బంది


శృంగవరపుకోట: తహసీల్దార్ కార్యాలయం వద్ద..


కొత్తవలస: నివాళులర్పిస్తున్న తహసీల్దార్, సిబ్బంది

వైసీపీ పాలనలో ఉద్యోగులకు భద్రత కరువు

బొండపల్లి: విధుల్లో బాధ్యతగా పనిచేసిన ఉద్యోగులకు వైసీపీ పాలనలో భద్రత లేకుండా పోవడం విచారకరమని టీడీపీ మండల అధ్యక్షుడు కోరాడ కృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎస్.రమణయ్య ను హత్య చేయడం వైసీపీ పాలనకు నిదర్శనమని అన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బి.బాలాజీ, పచ్చిమట్ల కృష్ణమూర్తిరాజు, రాపాక అచ్చింనాయుడు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హమ్మయ్య.. పింఛన్లు ఇచ్చారు


పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి ఆనంద్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జియ్యమ్మవలస: మండలంలోని పీటీ మండ పంచాయతీ పల్లపుసిరిపి గ్రామ పింఛన్‌దారులకు ఎట్టకేలకు పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి ఆనంద్ శనివారం ఆ గ్రామానికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ గ్రామంలో 16 మంది వృద్ధాప్య, ఆరుగురు వితంతు, మరో ఆరుగురికి వికలాంగ పింఛన్లు, ఒకరికి అభయహస్తం పింఛన్‌తో మొత్తం 29 మందికి జనవరి, ఫిబ్రవరి నెలలకు సంబంధించి పింఛన్లు పంపిణీ కాలేదు. దీనిపై ఈనెల 2న ఆంధ్రజ్యోతిలో 'వలంటీరు తప్పిదం.. పింఛన్లకు దూరం' శీర్షికన కథనం వెలువడింది. దీంతో ఉన్నతాధికారులు వెంటనే స్పందించి పింఛన్లకు నిధులు మంజూరు చేశారు. ఇందులో 28 మందికి రెండు నెలల పింఛన్లకు సంబంధించిన సొమ్ము రూ.1.69లక్షలు వచ్చింది. అయితే ఇందులో అడ్డాకుల మన్మథరావు అనే దివ్యాంగుడి పింఛన్‌కు డబ్బులు వచ్చాయి కానీ, ఆర్డర్ రాలేదని ఎంపీడీవో పి.శ్రీనివాసరావు తెలిపారు. ఆయన కిడ్నీ బాధితుడని, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారితో మాట్లాడాల్సి ఉందని, అతని అనుమతితో త్వరలోనే ఇతనికి పింఛను అందిస్తామని ఎంపీడీవో స్పష్టం చేశారు.

రహదారి విస్తరణ పనులు పూర్తి చేయరా?


నిరసన తెలుపుతున్న టీడీపీ, జనసేన నాయకులు

వీరఘట్టం: వీరఘట్టం ప్రధాన రహదారి దుస్థితిపై టీడీపీ, జనసేన నాయకులు శనివారం నిరసన తెలిపారు. రహదారి విస్తరణ పనులు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా పనులు మాత్రం పూర్తికాలేదని టీడీపీ మండల అధ్యక్షుడు ఉదయాన ఉదయ్‌భాస్కర్ అన్నారు. అసంపూర్తి రహదారితో పాటు ప్రజలు, వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వేగవంతంగా పనులు పూర్తి చేయాలని అరకు పార్లమెంటరీ బీసీ సెల్ కన్వీనర్ పొదిలాపు కృష్ణమూర్తినాయుడు పేర్కొన్నారు. ఈ నెల 7న పాలకొండలో జరగనున్న లోకేష్ శంఖారావం సభకు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. ఈ నిరసనలో జామి లక్ష్మీనారాయణ, చింతాడ ఉమ అనిల్‌బాబు, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు తప్పనిసరి


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో కల్పనాకుమారి

పాలకొండ: పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు తప్పనిసరిగా ఉండాలని ఐటీడీఏ పీవో కల్పనాకుమారి ఆదేశించారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఆర్‌సీఎం పాఠశాలలో ఉన్న పోలింగ్ కేంద్రాలను ఆమె శనివారం పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాల పోలింగ్ కేంద్ర భవనం పాతబడిందని, ఆ స్థానికంగా కొత్తగా నిర్మించిన భవనాన్ని పోలింగ్ కేంద్రంగా వినియోగించాలని సూచించారు. ఆర్‌సీఎం పోలింగ్ కేంద్రంలో పారిశుధ్య పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం పరుశురాంపురంలోని ఎంపీపీ పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు అవసరమయ్యే ర్యాంపులు, మరుగుదొడ్లు, విద్యుత్ వంటి సదుపాయాలు వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం ఎన్.పారాపురం, అర్ధలిలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఎన్నికల సిబ్బంది, ఎంఈవో పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి


నిరసన తెలుపుతున్న సర్పంచ్ గౌరీశంకర్, గ్రామస్థులు

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం తహసీల్దార్‌గా పనిచేసిన రాములమ్మపై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ గౌరీశంకరరావు శనివారం ధర్నా చేశారు. అనంతరం డీటీకి వినతిపత్రం సమర్పించారు. తహసీల్దార్ రాములమ్మ సర్టిఫికెట్లు మంజూరు, తదితర పనుల కోసం లంచాలు తీసుకున్నట్టు ఆరోపించారు. భూములు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నానని తహసీల్దార్ తనపై తప్పుడు ఆరోపణలు చేసి సోషల్ మీడియాలో పెట్టారని సర్పంచ్ ఆందోళన చెందారు. ఇందుకు నిరసనగా గ్రామ ప్రజలు ధర్నా చేశారని మండల ఉపాధ్యక్షుడు శేఖం తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన నాయకులు లోవరాజు, వివిధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు. ఈ విషయంపై తహసీల్దార్ రాములమ్మను వివరణ కోరగా, తాను బదిలీ వెళ్లిపోయాయనని, తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు.

'చలో విజయవాడ' జయప్రదం చేయాలి

పాలకొండ: ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారానికి ఫిబ్రవరి 8న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ కార్యకర్తలకు కనీస వేతనాలు చెల్లించాలన్నారు. ప్రభుత్వ సెలవులు, మెడికల్ లీవ్స్, మెటర్నటీ లీవ్స్ అమలు చేయాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ ఇవ్వాలని కోరారు. పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల సమన్వయ కమిటీ కార్యదర్శి కాద రాము, ఆశవర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ నాయకులు గౌరీశ్వరి, ఆశ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు ఎం.ధనలక్ష్మి, కె.శాంతి, పి.శ్రీదేవి, రాధారాణి, ప్రభావతి, కన్యాకుమారి, శాంతి, గౌతమి తదితరులు పాల్గొన్నారు.

సారా విక్రయాలకు వ్యతిరేకంగా ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న సీఐ జీడీబాబు తదితరులు

సాలూరు/రూరల్: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం సాలూరులో సారా విక్రయాలకు వ్యతిరేకంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాలూరు పట్టణ సీఐ జీడీ బాబు మాట్లాడుతూ సారా అమ్మకాలు చేస్తే పిల్లలకు సమాజంలో గౌరవం లభించదన్నారు. సాలూరులో సారా విక్రయాల్లో మహిళలుండడం బాధ కలిగిస్తుందన్నారు. ఆయన పిలుపుతో కొందరు సారాను ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సురేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆసరా చెక్కుల పంపిణీ

వీరఘట్టం: మండల కేంద్రంలో శనివారం నాలుగో విడత వైఎస్సార్ ఆసరా చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి చెక్కులను అందించారు. 1,378 సంఘాల్లోని 15,323 మంది సభ్యులకు ఆసరా నిధులు విడుదలయ్యాయి. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణ, జెడ్పీటీసీ జంపు కన్నతల్లి, తహశీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీఓ సాల్మన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ పేరుతో వైసీపీ దగా

- టీడీపీ పార్వతీపురం నియోజకవర్గ ఇన్‌చార్జి విజయచంద్ర


మాట్లాడుతున్న విజయచంద్ర

బెలగాం: ఎన్నికలు సమీపిస్తున్న వేళ వైసీపీ మరో మోసానికి తెరలేపిందని, మెగా డీఎస్సీ ప్రకటించి నిరుద్యోగులను దగా చేస్తోందని టీడీపీ పార్వతీపురం నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల విజయచంద్ర ఆరోపించారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తుండడంతో డీఎస్సీతో దగా చేయడానికి సీఎం జగన్మోహన్‌రెడ్డి సిద్ధం అయ్యారని తెలిపారు. దేశంలో గంజాయి ఎక్కడ దొరికినా మూలాలు ఏపీలోనే ఉంటున్నాయని.. రాష్ట్రాన్ని గంజాయి వనంగా తయారు చేశార ని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బర్నాల సీతారాం, గొట్టాపు వెంకటనాయుడు, మజ్జి వెంకటేష్, కౌన్సిలర్ కోరాడ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ సంఘ నేతల నిర్బంధం

సాలూరు రూరల్: జీపీఎస్ విధానం రద్దు చేసి, పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) పునరుద్ధరించాలని కోరుతూ ఈనెల 4న విశాఖలో తలపెట్టిన సాగర సంగ్రామ దీక్షకు వెళ్లేందుకు సిద్ధమైన ఏపీ సీపీఎస్‌ఈఏ నేతలను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. సాలూరులో ఏపీ సీపీఎస్‌ఈఏ నేత ఆర్నిపల్లి తిరుపతిరావును పట్టణ పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు.

గిరిజన సంపద దోచుకుంటున్నా స్పందించరా?

- ఏపీ తీరుపై లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు బాబ్జీ ఆక్షేపణ

సాలూరు రూరల్: సాలూరు మండలంలో కొఠియా గ్రూపు గ్రామాలపై ఒడిశా దూకుడు ప్రదర్శిస్తూ గిరిజన సంపదను దోచుకుంటున్నా ఏపీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తడంపై లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ ఆక్షేపించారు. ఈసందర్భంగా ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గిరిజన సంపదను ఒడిశా దోచుకుంటున్న ఏపీ సీఎం జగన్ స్పందించకపోవడం దారుణమన్నారు. కొఠియా గ్రామాల్లో ఒడిశా ప్రభుత్వం చేస్తున్న పనులకు ఏపీ సీఎం మెతక వైఖరి అవలభిస్తున్నారని ఆయన ఆరోపించారు. కొఠియాలో ఏపీ ప్రయోజనాలు కాపాడడానికి ప్రభుత్వం కట్టుబడి ఉండాలని ఆయన డిమాండ్ చేశారు.

వెంకటరావు అంకితభావం ఉన్న వ్యక్తి

పార్వతీపురం ఆంధ్రజ్యోతి: జిల్లా రెవెన్యూ అధికారి వెంకటరావు పనిపట్ల అంకితభావం కలిగిన వ్యక్తి అని కలెక్టర్ నిశాంత్‌కుమార్ అన్నారు. బదిలీపై వెళుతున్న వెంకటరావుకు కలెక్టర్ కార్యాలయంలో శనివారం ఘనంగా వీడ్కోలు పలికారు. కలెక్టర్ మాట్లాడుతూ వెంకటరావు జిల్లా ఉత్తమ రెవెన్యూ అధికారి అన్నారు. పార్వతీపురం ఐటీడీఏ పీవో సి.విష్ణుచరణ్ మాట్లాడుతూ వెంకటరావు చక్కటి సమయస్ఫూర్తిగల అధికారి అన్నారు. ఏఎస్పీ దిలీప్‌కిరణ్ మాట్లాడుతూ రెవెన్యూ, పోలీస్‌శాఖల మధ్య మంచి సమన్వయం చేశారన్నారు. బదిలీపై వెళుతున్న జె.వెంకటరావు మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లా రెవెన్యూ అధికారిగా పనిచేయడం గొప్ప సంతృప్తినిచ్చిందన్నారు. ఈ సందర్భంగా వెంకటరావును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాలకొండ ఆర్డీవో హేమలత, ఆర్డీవోగా బదిలీ అయిన ఎం.లావణ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన అవసరం


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గరుగుబిల్లి: కుష్ఠు వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగిఉండాలని గరుగుబిల్లి వైద్యాధికారి ఎస్.సంతోషకుమార్ అన్నారు. జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమంపై మండల కేంద్రంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పర్శ లేని మచ్చలను కుష్ఠు వ్యాధిగా అనుమానించవచ్చునని చెప్పారు. శరీరంపై రాగి రంగులో గానీ, గోధుమ రంగులో గానీ మచ్చలు ఉన్నట్లయితే సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. ప్రాథమిక దశలో గుర్తించి చికిత్స పొందితే త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని చిలకలపల్లి ఫార్మాసిస్టు వై.బలరాం నాయుడు తెలిపారు. వ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా అవసరమైన మందులు అందిస్తామని చెప్పారు. ఈ అవగాహన కార్యక్రమం ఈనెల 13వ తేదీ వరకు గ్రామాల్లో నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది దాసరి మృత్యుంజయరావు, ఉదయకుమారి, శ్రీదేవి, సింహాచలం, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

దేవనాపురంలో బాబు ష్యూరిటీ


బాబు ష్యూరిటీలో పాల్గొన్న జయకృష్ణ

సీతంపేట: మండలంలోని దేవనాపురం పరిధి రుక్మిణిగూడలో టీడీపీ పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో శనివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. మినీ మ్యానిఫెస్టోలోని సూపర్‌సిక్స్ అంశాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో యూనిట్ ఇన్‌చార్జి గేదెల కాంతారావు, సీనియర్ నాయకులు సవర సొడంగి, టీడీపీ తెలుగు యువత అధ్యక్షుడు సిరిపురం జగదీష్, లీలా ప్రసాద్, సవర రంగయ్య సవర సురేష్ పాల్గొన్నారు.

లోకేష్ పర్యటనను విజయవంతం చేయండి


టీడీపీ మినీఫెస్టో కరపత్రాలను చూపిస్తున్న నాయకులు

కురుపాం రూరల్: జిల్లాలో ఈనెల 7న జరిగే టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా లోకేష్ పర్యటనను విజయవంతం చేయాలని పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం కురుపాం ఏజెన్సీలోని 14 గ్రామ పంచాయతీలకు చెందిన టీడీపీ శ్రేణులు పెదగొత్తిలి గ్రామంలో సమావేశమయ్యారు. అధిక సంఖ్యలో కార్యకర్తలను కార్యక్రమానికి తరలించాలని తీర్మానించారు. తెలుగుదేశం పార్టీ ప్రకటించిన 6 గ్యారంటీలను ప్రజలకు చేర్చాలన్నారు. కార్యక్రమంలో పలువురు సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ జడ్పీ మెంబర్లు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధితో దేశాభివృద్ధి

మక్కువ: మహిళల ఆర్థిక అభివృద్ధే దేశాభివృద్ధి అని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మండల కేంద్రంలో ఆయన శనివారం ఆసరా చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం స్థానిక 1, 2 సచివాలయాలను, రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. వీటిని ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈసందర్భంగా లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసరావు, వైసీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు, ఎంపీపీ పారమ్మ, సర్పంచ్ రామలక్ష్మి, ఎంపీడీవో పి.దేవకుమార్, తహసీల్దార్ ఎ.సూర్యనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు



గుమ్మలక్ష్మీపురం: అవగాహన కల్పిస్తున్న ఎంఈవో జగన్నాథంనాయుడు

పాచిపెంట: పి.కోనవలస ఏపీటీడబ్ల్యూఆర్ స్కూల్ విద్యార్థులకు శనివారం నీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. నీడ్ సంస్థ సిబ్బంది బి.కనక రత్నం మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ఉండాలని సూచించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత గురించి వివరించారు. ఎం.పవర్ ఆదిత్య బిర్లా ఎడ్యుకేషన్ సౌజన్యంతో అవగాహన కల్పించామని నీడ్ స్వచ్ఛంద సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.వేణుగోపాలరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జేఎస్‌కే రాజు, నీడ్ సిబ్బంది, పీసీ కె.మోహనరావు, విద్యార్థులు పాల్గొన్నారు. **గుమ్మలక్ష్మీపురం:** విద్యార్థులకు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా ముఖ్యమని ఎంఈవో జగన్నాథంనాయుడు అన్నారు. ఆదిత్య బిర్లా ఎడ్యుకేషన్ ట్రస్టు, నీడ్ సంస్థ సహకారంతో యస్ సొసైటీ ఆధ్వర్యంలో టిక్కబాయి ఆశ్రమ పాఠశాలలో పిల్లలకు మానసిక ఆరోగ్యంపై శనివారం అవగాహన కల్పించారు. ఎంఈవో మా ట్లాడుతూ పిల్లలు ఒత్తిడిని అధిగమించడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయన్నారు. అనంతరం షేక్‌గౌస్ మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కొర శ్రీను, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా..

భక్తిశ్రద్ధలతో పైడితల్లమ్మకు పూజలు


అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

పార్వతీపురంటౌన్: పట్టణంలోని బెలగాం రైల్వే కాలనీలో వెలసిన శ్రీపైడితల్లమ్మ మందిర వార్షికోత్సవం సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అనువంశ ధర్మకర్తలు గొర్లివారి కుటుంబ సభ్యులు పూజల్లో పాల్గొన్నారు.

ఆర్డీవోగా వెంకటరమణ బాధ్యతల స్వీకరణ


కలెక్టర్‌ను కలిసిన ఆర్డీవో

పాలకొండ: పాలకొండ రెవెన్యూ డివిజన్ అధికారిగా వెంకటరమణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన ఆర్డీవో మాట్లాడుతూ డివిజన్‌లోని అన్నిశాఖల అధికారులతో సమన్వయంగా పనిచేస్తూ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

శ్రీకాకుళం కలెక్టర్‌ను కలిసిన ఐటీడీఏ పీవో

సీతంపేట: శ్రీకాకుళం జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన మనజీర్‌జిలానీ సమూన్‌ను సీతంపేట ఐటీడీఏ పీవో కల్పనాకుమారి శనివారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈసందర్భంగా సీతంపేట ఐటీడీఏ పరిధిలో ఉన్న 16 మండలాలకు సంబంధించి పలు అభివృద్ధి పనులను కలెక్టర్ దృష్టికి పీవో తీసుకొచ్చారు.

పర్యావరణ అభివృద్ధిలో విద్యార్థుల పాత్ర కీలకం

పాలకొండ: పర్యావరణ సుస్థిర అభివృద్ధిలో విద్యార్థుల పాత్ర కీలకమని వక్తలు పేర్కొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జీవ వైవిధ్యం ప్రాముఖ్యతపై రెండు రోజుల సెమినార్‌ను శనివారం ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్యాంబాబు అధ్యక్షతన జరిగిన సెమినార్‌లో మొదటి రోజు పాలకొండ డివిజన్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కె.తవిటినాయుడు, విశ్రాంత గ్రంథాలయాధికారి చౌదరి నాయుడు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. రిసోర్స్ పర్సన్‌గా సీనియర్ సైంటిస్ట్ ఎం.శంకరరావు, భరద్వాజ్ పాల్గొన్నారు. అడవులు దగ్ధమైనపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించే పోస్టర్లను ఆవిష్కరించారు. వివిధ విభాగాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ బి.రాజు, వైస్ ప్రిన్సిపాల్ బి.జయమణి, వృక్షశాస్త్ర అధ్యాపకులు వి.జనార్దనరావు, పి.ఉపేంద్రరావు, అధ్యాపకులు శ్రీనివాసరావు, రాఘవేంద్రనాయుడు, ఎం.శాంతి, పి.రాజ్యలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదానికి గురైన యాత్రికుల బస్సు

ఒడిశా

- పలువురికి గాయాలు


బస్సు అద్దాలు పగిలిన దృశ్యం

రాయగడ: పూరీ శ్రీక్షేత్రం మందిర పరిక్రమ ప్రాజెక్టు దర్శనం కోసం భక్తులను తీసుకెళుతున్న బస్సు.. జెట్నీ సమీపంలో ప్రమాదానికి గురయ్యింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. భక్తులకు జగన్నాథుని దర్శనం కల్పించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం జిల్లా నలుమూలల నుంచి బస్సులు ఏర్పాటుచేసింది. ఇందులో భాగంగా రాయగడ జిల్లా గుడారి ఎన్ఏసీ నుంచి 42 మంది భక్తులతో వెళ్తున్న బస్సు శుక్రవారం సాయంత్రం 4 గంటల సమయంలో జెట్నీ సమీపంలో ట్రక్కును ఢీకొట్టింది. ఈ ఘటన లో న్యాక్ చీఫ్ షర్మితా సబర్‌తో పాటు 20 మంది గాయపడ్డారు. విష యం తెలిసిన వెంటనే అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగా త్రులను ఖుర్దా ఆసుపత్రిలో చేర్చి చికిత్సనందించారు. ప్రయాణికులంతా క్షేమంగా ఉన్నారని అక్కడికి చేరుకున్న బిజూ స్వస్థ్య కల్యాణ యోజన సలహాదారు తెలిపారు.

మాతృభాషతోనే అభివృద్ధి


రాష్ట్ర గీతాన్ని ఆలపిస్తున్న కలెక్టర్ మహాజన్

రాయగడ: మానవ జీవిత మనుగడ కోసం ఎన్ని భాషలు నేర్చినా మాతృభాషతోనే అభివృద్ధి సాధ్యమని కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ వ్యాప్త ఒడియా భాషా సమ్మేళనం కార్యక్రమాన్ని శనివారం ప్రారంభిం చింది. ఇందులో భాగంగా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. తొలుత రాష్ట్ర గీతం వందే ఉత్కళ జననీ గీతాలపన చేశారు. ఒడియా భాష ప్రాశస్త్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.వందకోట్లతో ఈ కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. డీఐపీఆర్‌వో బసంతకుమార్ ప్రధాన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.